క్లుప్తంగా

తుదిదశకు భూ రీసర్వే పనులు



వెక్టరైజేషన్ పనుల్లో బిజీగా ఉన్న గ్రామ సర్వేయర్లు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామానికి సంబంధించిన భూ రీ సర్వే పనులు తుది దశకు చేరాయని తహసీల్దార్ జయప్రసాద్ బుధవారం తెలిపారు. ఇప్పటికే రీ సర్వే పూర్తయ్యిందని, ప్రస్తుతం వెక్టరైజేషన్ పనుల్లో గ్రామ సర్వేయర్లు నిమగ్నమయ్యారని చెప్పారు. హద్దులు, విస్తీర్ణంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని మండల సర్వేయర్ మల్లయ్యను ఆదేశించారు. పనులను డిప్యూటీ తహసీల్దార్ రవి పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ఉపాధ్యాయులు

రుద్రవరం: స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన పవన్ నాగదివెస్, రాజశ్రీ, రమ్య, మల్లేశ్వరి ఎస్‌జీఎఫ్ అండర్–19 రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరచారని చెప్పారు. వారు ఈ నెల 11,12,13 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

సీసీ రోడ్ల నాణ్యత పరిశీలన



నాణ్యతను పరిశీలిస్తున్న విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ డీఈ

దొర్నిపాడు: మండల కేంద్రంలో రూ.34 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్ల నాణ్యతను విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ డీఈ మోహన్‌రావు బుధవారం పరిశీలించిచారు. అనంతరం అన్ని రోడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ కొండారెడ్డి, విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఏఈ నాగలక్ష్మయ్య కాంట్రాక్టర్ నజీర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉమా, యామిని పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి

గోస్పాడు: గ్రామ సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు సత్వరమే అందేలా చూడాలని ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులకు అందేలా చూడాలన్నారు. ఏవైనా సమస్యలు తమ పరిధిలో పరిష్కారం కాకపోతే ఉన్నతాధికారులకు నివేదించాలని చెప్పారు. నీటి సమస్య, పారిశుద్ధ్యం, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ, అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుద్ధ్యం మెరుగు

ఉయ్యాలవాడ : ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడుతుందని ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. మూడు రోజులుగా మండలంలో వర్షాలు కురుస్తున్నాయని, మురుగు కాలువల్లో చెత్తా, చెదారం పేరుకు పోవడంతో వర్షపునీరు, వృథా నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు తెలిపారు. గృహాల పక్కనున్న కాలువల్లో వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ కవర్లను వేయరాదని సూచించారు. వ్యర్థ పదార్థాలను తీసుకెళ్లేందుకు హరితరాయబారులు ఇంటింటికీ తిరుగుతున్నారని, వారికి అందజేయాలని కోరారు.

విజయవంతం చేయండి

నంద్యాల(సెంట్రల్): శ్రీబాగ్ ఒడంబడిక వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీన నంద్యాలలో జరిగే రాయలసీమ హక్కుల దినోత్సవ సభను విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎస్.రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సమితి కార్యాలయంలో సభ్యులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమ అస్తిత్వానికి చిరునామా అయిన శ్రీబాగ్ ఒడంబడిక అమలు కోసం సమితి ఎన్నో పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. కేంద్రం కృష్ణా జలాల పంపిణీపై ఇటీవల తెచ్చిన చీకటి జీవో, రాయలసీమ హక్కుల సాధనే ధ్యేయంగా నిర్వహిస్తున్న సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఆంధ్రాబ్యాంకు ఏజీఎం శివనాగేశ్వరరెడ్డి, మహమ్మద్ పర్వేజ్, మహేశ్వర రెడ్డి, శ్రీహరి, షణ్ముఖరావు, భాస్కర్‌రెడ్డి, పట్నం రాముడు, సౌదాసాగర్ ఖాసిం, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

జగనన్న పాలన జనరంజకం



యాళ్లూరులో వృద్ధుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

గోస్పాడు: రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జనరంజక పాలన సాగుతోందని, మరి కొన్నేళ్ల పాటు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేసి ఆదుకుని వారి అభివృద్ధికి దోహదం చేస్తున్నారని, అలాంటి పాలన మనకు ఎంతో అవసరమన్నారు. బుధవారం మండలంలోని యాళ్లూరు గ్రామంలో బుధవారం మూడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను ప్రజలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటికే సంక్షేమ పథకాలను అందజేసి ప్రజల మనసుల్ని జగనన్న చూరగొన్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీల నాయకులు బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారని వాటన్నిటిని అధిగమించి ముందుకెళ్తున్నామని చెప్పారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు మళ్లీ జగనన్నే గెలిపించాలని సిద్ధమయ్యారన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శకుంతలమ్మ, వైస్ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ బొక్కెం నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు భారతి, కళ్యాణి, నాయకులు కైప శివరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, బొక్కెం రామేశ్వరరెడ్డి, కైప శ్రీనివాసరెడ్డి, బొక్కెం రాజారెడ్డి, ద్వారం సుధాకర్‌రెడ్డి, మండల అధికారులు భాస్కర్, విజయ్‌శేఖర్, అనసూయ, రాజశేఖర్‌రెడ్డి, నాగజ్యోతి పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపించరాదు

నంద్యాల (సిటీ): చెరువు కట్టపై చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించరాదని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్ రెడ్డి సూచించారు. బుధవారం టూరిజం శాఖ ఆధ్వర్యంలో గ్రీన్‌కో సంస్థ చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రం అయ్యాక అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడం తమ బాధ్యత అని, అందుకే పార్కులు నిర్మిస్తున్నామని, గతంలో ఉన్నవాటిని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ పాంషావలి, కౌన్సిలర్ పురంధర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు దేశం సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



చెరువు కట్టపై అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

‘పల్లెకు పోదాం’ విజయవంతం చేయండి

రుద్రవరం: మండలంలో ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పల్లెకు పోదాం కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులందరూ కలిసి విజయవంతం చేయాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం 16 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ సభలు చేపడతామని చెప్పారు. సభల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రజల నుంచి వచ్చే వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామ సభలకు నోడల్ అధికారిగా ఈఓపీఆర్డీ, సచివాలయ నోడల్ అధికారిగా పంచాయతీ కార్యదర్శి ఉంటారని వివరించారు.

దొర్నిపాడు: మండలంలో ఈనెల 9 నుంచి 22 తేదీ వరకు పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. 9న బుర్రారెడ్డిపల్లె, 10న చాకరాజువేముల, 14న దొర్నిపాడు–1, 15న దొర్నిపాడు–2, 16న గుండుపాపల, 17న కొండాపురం, 20న క్రిష్టిపాడు, 21న డబ్ల్యూ గోవిందిన్నె, 22న డబ్ల్యూ కొత్తపల్లె గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల నోడల్ అధికారిగా ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, గ్రామ సచివాలయ నోడల్ అధికారులుగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 3 నుంచి 5గంటల వరకు కార్యక్రమం ఉంటుందని, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల బోర్డులను ప్రదర్శించి, సమస్యలుంటే ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని వివరించారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిత్యం అందుబాటులోనే..



ఎస్‌బీఐ కాలనీలో డ్రైనేజీని శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నంద్యాల(సిటీ): నంద్యాలలోని మున్సిపల్ అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. బుధవారం పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో రోడ్డుపైకి డ్రైనేజీ నిండి మురుగు నీరు రావడంతో స్థానికులు, వాహనదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే స్పందించిన మున్సిపల్ శానిటరీ సూపర్ వైజర్ లక్ష్మీనారాయణ రాత్రి 8 :30 గంటల సమయంలో పారిశుద్ధ్య కార్మికులు, ప్రొక్లెయిన్ సహాయంతో గంట పాటు శ్రమించి కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. రాత్రి పూట కూడా స్పందించి విధులు నిర్వర్తించిన అధికారులు, సిబ్బందిని స్థానికులు అభినందించారు.

నేటి నుంచి ‘వార్డుకు పోదాం’

నంద్యాల(సిటీ): పట్టణంలో గురువారం నుంచి వార్డుకు పోదాం కార్యక్రమం ప్రారంభం కానుందని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్డు సచివాలయాల పరిధిలో జరిగే కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది హాజరుకానున్నారన్నారు. నాలుగున్నర సంవత్సరాల్లో ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని ఈ కార్యక్రమం ద్వారా వివరిస్తారని చెప్పారు. మొదటి దశలో పొన్నాపురం–1వ సచివాలయం నుంచి మొదలై ఈ నెల 23వ తేదీ వరకు వివిధ వార్డులలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమ వివరాలు..

తేదీ	సచివాలయం
09-11-23	పొన్నాపురం-1
10	రైతునగరం-1 మున్సిపల్ కార్యాలయం
14	పొన్నాపురం-2 హరిజనవాడ
15	మాల్దార్‌పేట నూనెపల్లె హరిజనవాడ
16	రైతునగరం-2 పార్క్‌రోడ్
17	జగజ్జననీ నగర్
20	బాల్కొండహాల్
21	ముల్లాన్‌పేట
22	బాలాజీ కాంప్లెక్స్
23	సరస్వతీ నగర్

రైతు భరోసా కింద 6,431 మందికి లబ్ధి

ఉయ్యాలవాడ : మండలంలో వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం కింద 6,431 మంది రైతులు లబ్ధి పొందారని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ బుధవారం తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన రైతులు 5,491 మంది, కౌలు రైతులు 935 మంది, ఆలయ భూములు సాగు చేస్తున్న ఐదుగురికి కలిపి ప్రభుత్వం రూ. 2,57,24,000 వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసిందని చెప్పారు.

మొక్కలు కాలుష్యాన్ని తగ్గిస్తాయి

నంద్యాల(అర్బన్): ఆకుపచ్చని మొక్కలు కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా జీవరాశులకు ఆక్సిజన్‌ను అందిస్తాయని నంద్యాల జిల్లా గ్రీన్ క్రోప్స్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మొక్కలతో భూగర్భజలాలు అభివృద్ధి చెందడంతో పాటు భూతాపాన్ని తగ్గిస్తాయన్నారు. పుడమికి రక్షణ–మొక్కల సంరక్షణలో భాగంగా బుధవారం మండలంలోని పోలూరు జెడ్పీహెచ్ స్కూల్‌లో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటేశుడు ఆధ్వర్యంలో విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సుందర్‌రావు, సుబ్బారెడ్డి, శ్రీను, జగన్ మోహన్‌రెడ్డి, కవిత, ప్రసాద్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల మస్టర్ వివరాలివ్వండి

రుద్రవరం: వైఎస్సార్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు 90 రోజుల మస్టర్ త్వరగా వేయాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి ఉపాధి హామీ పథకం సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో బుధవారం ఏపీఓ ప్రతాప్, ఎఫ్‌ఏ, టీఏలతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గృహ నిర్మాణాల్లో వేగం పెంచేందుకు కృషి చేయాలని చెప్పారు.లబ్ధిదారులకు రోజుకు రూ.272 ప్రకారం 90 రోజుల మస్టర్ వేసి రికార్డులు అందజేయాలని, అలాగే 90 రోజులు పూర్తయిన వారికి అదనంగా మరో పది రోజుల మస్టర్ వేయాలని ఆదేశించారు.

వ్యక్తి అదృశ్యం



కుందవరం త్యాగరాజు

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన కుందవరం త్యాగరాజు అలియాస్ ఎలీషా (70) అదృశ్యమయ్యాడని ఎస్‌ఐ తిరుపాల్ బుధవారం తెలిపారు. 2022 అక్టోబరు 10న ఇంటి నుంచి వెళ్లిపోయాడని, బంధువులు, మిత్రులను విచారించినా ఆచూకీ లభించకపోవడంతో కుమారుడు కుందవరం స్వామి ప్రతాప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

లైసెన్స్ లేకుండా బాణాసంచా విక్రయించొద్దు

చాగలమర్రి: దీపావళి పండుగ సందర్భంగా లైసెన్సు లేకుండా బాణసంచా విక్రయాలు చేయకూడదని ఆళ్లగడ్డ ఫైర్ సేఫ్టీ అధికారి వీరారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని చాగలమర్రి, ముత్యాలపాడు గ్రామాల్లో పర్యటించారు. ముత్యాలపాడులో కొందరు ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్ యజమానులు అనుమతులు లేకుండా విక్రయాలు సాగిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అలాగే చాగలమర్రిలోని లైసెన్స్ పొందిన క్రాకర్స్ దుకాణాలను పరిశీలించి ప్రమాదాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు పాటించాలని యజమానులకు సూచించారు.



క్రిష్టిపాడు వద్ద కుందూ నది కింద సాగుచేసిన నంద్యాల సోన రకం పైరు

సిరులు వరించేలా..

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు వద్ద కుందూనది తీరంలో ఈ సారి రైతులు అధికంగా వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం కంకిదశలో ఉన్న పంట సిరులు వరించేలా కనిపిస్తోంది. వడ్లు గుత్తులు గుత్తులుగా చెట్లకు వేలాడుతుండంతో ఎకరానికి 40 బస్తాలకు పైగా దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరి ధాన్యం ధర కూడా ఆశాజనకంగా ఉంది.

75కేజీల బస్తా రూ.3వేల వరకు పలుకుతుండటంతో తాము ఈసారి గట్టెక్కినట్లేనని అన్నదాతలు సంబర పడుతున్నారు.

స్కిన్ అండ్ హెయిర్ లేజర్ క్లినిక్ ప్రారంభం



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యేలు శిల్పా, కాటసాని

నంద్యాలటౌన్: పట్టణంలోని పద్మావతి నగర్‌లో ప్రీతి స్కిన్ అండ్ హెయిర్ లేజర్ క్లినిక్‌ను ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వైద్య రంగంలో నంద్యాల మరింత అభివృద్ధి చెందేలా వైద్యులు కృషి చేయాలని సూచించారు. అనంతరం డాక్టర్ ప్రీతి మాట్లాడుతూ మహానగరాలకే పరిమితమైన స్కిన్ హెయిర్ అండ్ లేజర్ ట్రీట్‌మెంట్‌ను నంద్యాల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. వైద్యులు మధుమణి, వసుధారాణి, లక్ష్మిసౌజన్య పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



గుర్రం అనిల్‌కుమార్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ: అనారోగ్యానికి గురైన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త గుర్రం అనిల్‌కుమార్‌ను, కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన గుర్రం అనిల్‌కుమార్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 5 లక్షల చెక్కును ఎమ్మెల్యే బుధవారం బాధితుడి ఇంటివద్దకు వెళ్లి అందజేశారు. విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, పలచాని మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(సిటీ): అత్యవసర వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి అందించే ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 6వ వార్డుకు చెందిన రవి అనే వ్యక్తి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) రూ.10లక్షల ఆర్థిక సాయాన్ని బుధవారం బాధితుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శిల్పారవి అందించారు. కౌన్సిలర్ పురంధర్ పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన..

నంద్యాల(అర్బన్): ఎస్‌బీకేఎఫ్ 8వ ఇంటర్‌నేషనల్ గేమ్స్–2023 నేపాల్ దేశంలో ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన నంద్యాలకు చెందిన క్రీడాకారుడు వీరన్న స్వామిని ఎమ్మెల్యే శిల్పారవి బుధవారం అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం, డిస్కస్ త్రోలో సిల్వర్, వాకింగ్, రన్నింగ్ పోటీల్లో సిల్వర్ పతకాలు సాధించిన వీరన్నస్వామిని క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



పాఠశాలను బంద్ చేయిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నంద్యాల(న్యూటౌన్): కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు తెలిపారు. పట్టణంలోని విద్యా సంస్థలన్నీ బంద్ పాటించాయని చెప్పారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంస్థల ప్రైవేటీకరణను మానుకోవాలని సూచించారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నాగరాముడు, చిన్న శివ, నాగార్జున, రవి, బాలాజీ, కిరణ్, షాహిన్, రంగ, వినోద్, హరి పాల్గొరన్నారు.

3న కార్తీక వనభోజనాలు

నంద్యాలటౌన్: నంద్యాల అసెంబ్లీ సగర సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 3వ తేదీన నంద్యాల పట్టణంలోని ప్రథమనంది దేవస్థానం ఆవరణలోని వైఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో కార్తీక వన భోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల సగర సంఘం అధ్యక్షుడు టీవై శివ తెలిపారు. బుధవారం స్థానిక భరతమాత గుడిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులస్తులందరూ పాల్గొని వన భోజనాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వన భోజనాల కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షులు బాలాజీ, మురళీ, లక్ష్మయ్య, గురునాథ్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

నంద్యాల(న్యూటౌన్): గత నెల 30 వ తేదీన జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం స్టేట్ అడాప్షన్ ఏజెన్సీ ఎస్ఏఏలో చూపిన అన్ని పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి అధికారిని నిర్మలాదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్‌లో దిగువ తెలియజేసిన అంశాలను సవరించి రోస్టర్‌లో మార్పులు చేశామని చెప్పారు. అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

పిచ్చి కుక్క దాడి.. ఐదుగురికి గాయాలు

రుద్రవరం: మండలంలోని నర్సాపురం గ్రామంలో పిచ్చికుక్క దాడిలో ఐదుగురు గాయపడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు..బుధవారం ఓ పిచ్చి కుక్క శ్రీనివాసులు,లక్ష్మయ్య,నడిపి చంటిలతో పాటు మరో ఇద్దరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. బాధితులు వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకొని మెరుగైన చికిత్స కోసం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.

ఇష్టారాజ్యంగా పురుగు మందుల విక్రయాలు

- మోసపోతున్న చదువురాని రైతులు
- బిల్లులు ఇవ్వని వ్యాపారులు
- తెల్ల కాగితాలపైనే రాతలు



లింగమయ్య స్వామి సమీపంలో ఎండిన వరి పైరు,(ఇన్‌సెట్) తెల్ల కాగితంపై వేసిన బిల్లు


రుద్రవరం: పురుగు మందుల దుకాణాదారులు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అనుమతులు లేని మందుల విక్రయాలు జోరుగా సాగిస్తున్నారు.అలాగే చదువు రాని రైతులకు వాటిని అంటగడుతున్నారు. వాటి విక్రయాలకు సంబంధించి ఎలాంటి బిల్లులు ఇవ్వకుండా తెల్లకాగితాలపై రాసిస్తున్నారు. ఏదైనా పొరపాటు జరిగినప్పుడు రైతులు దుకాణాదారుడిని ప్రశ్నిస్తే.. తమ వద్ద మందులు కొనలేదని హూంకరించి వెనక్కి పంపుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని ముత్తలూరుకు చెందిన వెంకటేశులు అనే రైతు ఇటీవల ఆళ్లగడ్డ పట్టణంలోని ఓ పురుగు మందు దుకాణానికి వెళ్లి పొట్ట దశలో ఉన్న వరి పైరుకు దోమ కాటు, పురుగు నివాణకు మందులు ఇవ్వాలని కోరాడు. వారు వివిధ రకాల మందులతో పాటు గడ్డి నివారణ మందు కూడా ఇచ్చారు. గడ్డి మందుకు సంబంధించిన బిల్లు మినహా.. మిగిలిన వాటికి తెల్ల కాగితంపై బిల్లు వేసి ఇచ్చారు. చదువు రాని ఆ రైతు ఇంటికి చేరుకొని ఆ మందులను వరి పైరుపై పిచికారీ చేశాడు. అంతే.. రెండు రోజులకు వరి పైరు మొత్తం మాడిపోయింది. ఉదయం వెళ్లి పంటను చూసిన రైతు బోరుమని విలపించాడు.అటుగా వచ్చిన రైతులు గమనించి వాడిన పురుగు మందులను పరిశీలించి గడ్డి మందు ఎలా పిచికారీ చేశావని ప్రశ్నించారు. అప్పుడు తెలిసింది ఆ రైతుకు.. తాను మోసపోయానని. వెంటనే దుకాణదారుని వద్దకు వెళ్లి అడగ్గా మా దగ్గర కొనలేదని గద్దించి చెప్పడంతో కన్నీటితో వెనుతిరిగాడు.

అక్రమాలపై చర్యలు తీసుకుంటాం

తెల్ల కాగితాల్లో బిల్లులు వేసినట్లు, అనుమతులు లేని మందులు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే అలాంటి దుకాణాలపై దాడులు నిర్వహించి అక్రమాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీకృష్ణ, మండల వ్యవసాయాధికారి

నట్టేట ముంచారు



లింగమయ్య స్వామి ఆలయ సమీపంలో 1.60 ఎకరాల పొలం ఉంది.అందులో రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టి వరి పంట సాగు చేశా. ప్రస్తుతం పైరు కంకి దశలో ఉంది. దోమపోటును నివారించుకోవాలని ఆళ్లగడ్డ పట్టణంలోని ఓ దుకాణానికి వెళ్లి విషయం చెప్పాను. వారు మందులు ఇచ్చి తెల్ల కాగితంపై బిల్లు వేసిచ్చారు. సొమ్ము చెల్లించి వచ్చి వారిచ్చిన మందులు పిచికారీ చేశాను. అంతే పైరు మొత్తం మాడిపోయింది. ఇదేమని దుకాణదారుడినా అడిగినా పట్టించుకోలేదు. అధికారులు స్పందించి వ్యాపారుడిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలి.

– వెంకటేష్, రైతు, ముత్తలూరు

మరిన్ని కరువు మండలాలను గుర్తించండి

నంద్యాల (వ్యవసాయం): రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని కరువు మండలాలను గుర్తించాలని బీజేపీ కిసాన్ మొర్చా నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని అగ్రికల్చర్ జేడీఏకు వినతి పత్రం అందజేశారు. మోర్చా ఇన్‌చార్జ్ తూము శివారెడ్డి, నాయకులు మాట్లాడుతూ చివరి ఎకరం వరకు నీరు అందించి, ఉచితంగా ఎరువులు, విత్తనాలు రైతులకు అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మరిన్ని కరువు మండలాలను గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.